సాక్షి
సిద్దిపేట
మంగళవారం : 21 : మార్చి : 2023



ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు 8లో

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఎస్పీ రమణకుమార్ హెచ్చరించారు. రంజోల్ సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో మాట్లాడారు.

కళ్లలో కారం చల్లి.. కత్తులతో దాడి



కత్తులతో దాడి చేసి ఆపై కళ్లలో కారం చల్లి దారి దోపిడీకి పాల్పడ్డారు. ఈసంఘటన మెదక్ జిల్లా రేగోడ్ మండలంలోని తాటిపల్లి సమీపంలో జరిగింది. 8లో



రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శం

రాష్ట్రంలో అమలయ్యే సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. 9లో..

రియల్ సుడా

మిట్టపల్లిలో టౌన్‌షిప్‌నకు శ్రీకారం

- అసైనీల నుంచి 14 ఎకరాల సేకరణ
- రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన
- బహిరంగ వేలంతో ప్లాట్ల విక్రయాలు



మిట్టపల్లి వద్ద ఏర్పాటు చేయనున్న టౌన్‌షిప్ స్థలం

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట పట్టణాభివృద్ధి సంస్థ సుడా రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే పర్యాటకంగా, విద్యా కేంద్రంగా విలసిల్లుతున్న సిద్దిపేట శివారులో వెలిసిన కంపెనీలు, వివిధ వెంచర్లతో భూములకు డిమాండ్ పెరిగింది. దీన్ని అవకాశంగా భావించిన సుడా.. మిట్టపల్లి సమీపంలో 14 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించింది. ఈ స్థలాన్ని ప్లాట్లుగా మార్చి, సకల హంగులతో టౌన్‌షిప్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. బహిరంగ వేలం ద్వారా ప్లాట్లను విక్రయించి వచ్చిన లాభాలను పట్టణాభివృద్ధికి వినియోగించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

పూర్తయిన భూసేకరణ

- సిద్దిపేట అర్బన్ మండలంలో మిట్టపల్లిలో అసైన్డ్ భూములు కలిగిన పది మంది రైతుల నుంచి 14 ఎకరాల భూమిని సుడా సేకరించింది.
- డిసెంబర్ 9, 2022న ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 234 ప్రకారం ఎకరం భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందించనుంది.
- డెవలప్‌మెంట్ చేసిన టౌన్‌షిప్‌లో సుమారుగా 600గజాలకు పైగా స్థలం కేటాయించి

భూములు కోల్పోయిన వారికి ప్లాట్లు..

- అసైనీలకు ఇప్పటి వరకు భూమిని విక్రయించుకునే అవకాశం లేదు. సుడాకు భూమిని ఇవ్వడంతో అన్ని హక్కులు వస్తుండడంతో రైతులు భూమిని ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- 14 ఎకరాల భూమిని పూర్తి చదును చేయగా 67,760 గజాలుగా లెక్క తేలింది.

అన్ని సౌకర్యాలతో..

- టౌన్‌షిప్‌లో స్ట్రీట్ లైట్‌లు, పార్కులు, గార్డెన్, తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు.
- రోడ్లకు 23,909 గజాలు, పార్కులకు 6,099 గజాలు, మౌలిక సదుపాయాలకు 2,392 గజాలు కేటాయించనున్నారు.
- మిగిలిన 35,360 గజాల స్థలాన్ని 161 ప్లాట్లుగా విభజించి, భూమి ఇచ్చిన రైతులకు 50 ప్లాట్లను (10,861 గజాలు) కేటాయించనున్నారు.
- మిగిలిన 24,499 గజాలను ఒక్కో గజం రూ.8వేలుగా నిర్ణయించి సుడా అధికారులు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిసింది.
- అన్ని సౌకర్యాలతో తక్కువ ధరకే సుడా టౌన్‌షిప్‌లో ప్లాట్లు దొరుకుతుండడంతో ఎక్కువ మంది కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- ఇప్పటికే హైదరాబాద్ హెచ్‌ఎండీఏ, వరంగల్ పరిధిలో ఏర్పాటు చేసిన టౌన్ షిప్‌లకు మంచి డిమాండ్ ఏర్పడడంతో మిట్టపల్లిలో కూడా మంచి ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.
- ప్లాట్ల విక్రయాల ద్వారా వచ్చిన డబ్బులతో సుడా ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులను నిర్వహించనున్నారు.

వేలం ద్వారా విక్రయం



జిల్లాలో ప్రభుత్వ మోడల్ లే అవుట్‌లు ఎక్కడాలేవు. కలెక్టర్ సూచనలతో టౌన్‌షిప్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇందులో ప్లాట్లను కొనుగోలు చేసేవారికి బిల్డింగ్ అనుమతితో పాటు లోన్ సౌకర్యం సులువు అవుతుంది. త్వరలో బహిరంగ వేలం ద్వారా ప్లాట్లను విక్రయిస్తాం.

– రమణాచారి, సుడా వైస్ చైర్మన్

న్యూస్‌రీల్

రామకోటి సేవలు అభినందనీయం



ఏఈఓకు తలంబ్రాలు అందజేస్తున్న రామకోటి రామరాజు

గజ్వేల్‌రూరల్: రామకోటి రామరాజు చేస్తున్న సేవలు అభినందనీయమని భద్రాచల దేవస్థాన ఏఈఓ శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. భద్రాచల సీతారాముల కల్యాణోత్సవం కోసం పట్టణానికి చెందిన రామకోటి రామరాజు తన భక్తసమాజంతో కలిసి నెల రోజుల పాటు గోటితో ఒలిచి సిద్ధం చేసిన కోటి తలంబ్రాలను సోమవారం భద్రాచల దేవస్థానంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న రామరాజును ఏఈఓ అభినందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది, గజ్వేల్‌కు చెందిన అర్చకుడు ప్రదీప్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ తుది జాబితా విడుదల

నేడు లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద జాబితాను చూస్తున్న దరఖాస్తుదారులు

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తుది జాబితా సిద్ధమైంది. పలు సవరణల అనంతరం సోమవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఆదేశాల మేకు అధికారులు జాబితాను విడుదల చేశారు. ఇండ్ల కోసం తొలుత 3,518 దరఖాస్తులు రాగా ఫిబ్రవరి 3న 1,118 మందిని ఎంపిక చేశారు. దీనిపై అభ్యంతరాలు రావడంతో మార్చి 3న 1,389మందితో మరో లిస్టును విడుదల చేశారు. దీనిపై కూడా అభ్యంతరాలు రావడంతో రీసర్వే చేసిన అధికారులు 1,550 మందితో తుది జాబితా ప్రకటించారు. జాబితా ప్రతులను మున్సిపల్, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయం, వార్డుల్లో గోడలకు అతికించారు. మొత్తం 1,100 లకుపైగా ఇళ్లు ఉండగా, లబ్ధిదారుల సంఖ్య అంతకు మించి ఉండడంతో లక్కీ డ్రా ద్వారా అర్హులను ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. మంగళవారం ఉదయం 10.30గంటలకు మహతి ఆడిటోరియంలో డ్రా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్నవారు ఆధార్‌కార్డుతో లక్కీ డ్రాకు హాజరుకావాలని సూచించారు.

నిర్వాసితులకు రూ.8లక్షల పరిహారం



ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు ముంపు ఎస్సీ బాధితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక సాయం కింద రూ.8లక్షలు మంజూరైనట్లు హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. 8టీఎంసీల గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అడ్డుకున్నా.. సీఎం కేసీఆర్ సహకారంతో పూర్తి చేశామని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి 4వేల ఎకరాల భూమి సేకరించామని, ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీకి 185 మంది నిర్వాసితులకు రూ.8లక్షల ప్రత్యేక ప్యాకేజీని ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు .

యోగా శిబిరం ప్రారంభం



యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేటజోన్: టీటీసీ భవన్‌లో సోమవారం వ్యాయామ ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా తరగతులను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, మానసిక ఒత్తిడిని జయించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, రామస్వామి, అరుణ, రామేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతోనే సమగ్ర అభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పక్కన కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌తో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషితో వేసవిలో చెరువులు, కుంటలు నిండు కుండలా మారాయని, రైతులకు 24 గంటల విద్యుత్ అందుతోందని అన్నారు. మహిళల ఆరోగ్యం కోసం ఆరోగ్య మహిళ, రుతుప్రేమ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి వెలుగులో జిల్లా ఆదర్శంగా ఉందని అన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని అధికారులను కోరారు.



బీఆర్‌ఎస్,కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం

అధికారులకు తీరుపై ఆగ్రహం

ధర్మారం నుంచి లక్కపల్లి రోడ్డు సమస్య పరిష్కారం కావడం లేదంటూ కాంగ్రెస్ జెడ్పీటీసీ కొండల్ రెడ్డి పీఆర్ ఈఈ శ్రీనివాస్ రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి రావడం తప్ప అధికారులు సాధించింది ఏమీ లేదని, సమస్యలు చెప్పడం దండగని, సమావేశ నిర్వహణకు అర్థం లేదు.. అంటూ విమర్శలు చేశారు. చైర్‌పర్సన్ రోజాశర్మ జోక్యం చేసుకొని సర్దిచెప్పే ప్రయత్నం చేయగా, ఇరువురికి కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. సమావేశానికి సభ్యులు, అధికారులు అంతంతమాత్రంగా హాజరు కావడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న ఏఓ రెహమన్,డీఆర్‌ఓ లక్ష్మికిరణ్

- కలెక్టరేట్ ఏఓ, డీఆర్‌ఓ
- ప్రజావాణిలో 50 అర్జీల స్వీకరణ

సిద్దిపేటరూరల్: ప్రజావాణిలో వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టరేట్ ఏఓ రెహమన్, డీఆర్‌ఓ లక్ష్మికిరణ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పలు సమస్యలపై పలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్యులు తమ సమస్యలను విన్నవించుకుని, పరిష్కరించుకునేందుకు ఇది చక్కటి వేదిక అని అన్నారు. భూ సంబంధ, డబుల్ ఇళ్లు, ఆసరా పింఛన్లపై మొత్తం 50 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

అర్హులకు న్యాయం చేయాలి

సీఎం దత్తత గ్రామంలో నిరుపేదల కోసం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను గ్రామానికి సంబంధం లేని వ్యక్తులకు కేటాయిస్తున్నారు. డబ్బులు ఇచ్చిన వారికే డబుల్ ఇండ్లు ఇస్తామంటూ బెదిరిస్తున్నారు. అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలి.



నరసన్న పేట గ్రామస్తులు

ఉద్యోగ భద్రత కల్పించాలి



అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సిద్దిపేటరూరల్: జిల్లాలోని ఆయా మండలాల్లో ఈ–పంచాయతీలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా ఈ పంచాయతీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ కోరారు. ఈ పంచాయతీ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు మంద లక్ష్మణ్‌తో కలిసి మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా పని చేస్తున్న కార్మికులకు పేస్కెలు, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి బరిగే నర్సింలు, కోశాధికారి సంతోష్, సభ్యులు, పర్శరాములు, రాజేందర్ నాగరాజు, సుభాష్, కిషన్, రాజు, శాలిక, ప్రసన్న, రాణి, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

డంప్‌యార్డ్ లేని పట్టణంగా నిలపాలి

- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు
- జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్

సిద్దిపేటజోన్: సిద్దిపేట కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేందుకు అధికారులు కృషి చేయాలని, డంప్‌యార్డ్ లేని పట్టణంగా నిలపాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సోమవారం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. అనేక నగరాలు, పట్టణాలకు సిద్దిపేట ఆదర్శంగా నిలిచిందని, ఇక్కడి ప్రగతిని చూసి నేర్చుకునే ప్రయోగశాలగా మారిందని అన్నారు. స్వచ్ఛ సిద్దిపేట కోసం ప్రజలు అందించిన సహకారం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. బుస్సాపూర్ రిసోర్స్ పార్క్‌కు తడి, పొడి, హానికర చెత్తను వేర్వేరుగా తరలించాలని, సీసీ కెమెరాలతో చెత్త సేకరణ వాహనాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వార్డుల్లో వార్డ్ స్థాయి కంపోస్టు యార్డుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, సేంద్రియ ఎరువులు తయారు చేసి, నామమాత్ర ధరకు రైతులకు విక్రయించాలన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీపీ శ్వేతకు సూచించారు. బయో గ్యాస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని, స్టీల్ బ్యాంక్ సేవలను వివరించాలని, రుతుప్రేమ, ఆరోగ్య మహిళ పథకంపై ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, మంత్రి హరీశ్ రావు, పీఎస్ అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఓఎస్డీ బాలరాజు, మున్సిపల్ ప్రతినిధి రాజనర్స్, అధికారులు పాల్గొన్నారు.

‘ఆరోగ్య మహిళ’పై అవగాహన కల్పించాలి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శ్వేత, హాజరైన అధికారులు, వైద్యులు

సిద్దిపేటజోన్: ఆరోగ్య మహిళ పేరుతో ప్రతీ మంగళవారం అందిస్తున్న వైద్య సేవలపై గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలని పోలీసు కమిషనర్ శ్వేత అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో జిల్లాలో 13 ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సామాజిక సేవకురాలు డా.శాంతి, జిల్లా వైద్యాధికారి డా.కాశీనాథ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ మహిళల ఆరోగ్య రక్షణకు చేపట్టిన రుతుప్రేమ కార్యక్రమాన్ని వైద్యాధికారులు విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా చొరవ చూపాలన్నారు. ఆరోగ్య మహిళా కేంద్రాల్లో అందుతున్న సేవలు, రుతుప్రేమ ఆవశ్యకతపై మహిళలకు వివరించాలని, ఆరోగ్యకేంద్రాలకు వచ్చే మహిళలను చైతన్య పరచాలని సూచించారు. పట్టణంలో ఎల్లమ్మ గుడి వద్ద బస్తీ దవాఖానాలో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రం అందుబాటులో ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంత్రి ఓఎస్డీ బాలరాజు, వైద్యులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దీక్షలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు హాజరై మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీలతో సంబంధం లేదన్న మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలకు నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కావడంలేదని ఎద్దేవా చేశారు. మంత్రి కేటీఆర్ మీడియాను బెదిరింపులకు గురిచేయడం బాధాకరమన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆరోపించారు. పేపర్ లీకేజీ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరిని పర్మనెంట్ చేయాలని, ఉస్మానియా విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లన్నా.. వెళ్లొస్తాం

- ముగిసిన కొమురవెల్లి బ్రహ్మోత్సవాలు
- తెల్లవారుజామువరకు అగ్నిగుండాలు
- 9 వారాలు వైభవంగా సాగిన జాతర



అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్నా.. వెళ్లొస్తాం..మమ్మల్ని సల్లంగ చూడు.. అంటూ భక్తులు జాతర అనంతరం ఇంటిబాట పట్టారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు సాగిన అగ్నిగుండాలతో కొమురవెల్లిలో మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. భక్తులు భారీ సంఖ్యలో హాజరై అగ్నిగుండాలను దాటారు. ఆలయ ఈఓ, అర్చకులు, పాలక మండలి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ వేదిక ప్రాంగణంలో 7.15గంటలకు వీరభద్ర ప్రస్తాయం, భద్రకాళి పూజ, అగ్నిగుండాల ప్రజ్వలన ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 5 గంటలకు గురుపూజ, బలిహరణ, అగ్నిగుండాల ప్రవేశం, విజయోత్సవం, ఉదయం 11 గంటలకు స్వామి అమ్మవార్లకు ఏకాదశ రుద్రాభిషేకం, మహా మంగళహారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమానికి కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. 9 వారాలు కొనసాగిన జాతరలో సుమారు 10 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలు..

వీరశైవ ఆగమ శాస్త్ర పద్ధతిలో ఆలయ అధికారులు అగ్నిగుండాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. షట్‌స్థల బ్రహ్మ 108 సిద్ధయత్ శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. శని, ఆదివారాల్లో రూ.49,42,426ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఈఓ బాలాజీ ఏఈఓ అంజయ్య, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ చంద్రమోహన్, ధర్మకర్తలు, ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పూజారులు పాల్గొన్నారు.



పంచ పల్లవాలతో అగ్నిగుండాలను వెలిగిస్తున్న ఆలయ అర్చకులు



బియ్యం సుంకు పడుతున్న అర్చకులు

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివారాలు ఇలా ఉన్నాయి. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 18 మందిని పట్టుకున్నట్టు చెప్పారు. నిందితులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి 16 మందికి ఒక్కొక్కరికీ రూ.2వేలు, ఇద్దరికి రూ.3వేలు జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


రాజు (ఫైల్)

సిద్దిపేటరూరల్: విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన ఘటన జక్కాపూర్‌లో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ...నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌కు చెందిన బాయిమీది రాజు(32) రోజు వారీగా వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయం 8 గంటలకు బావి వద్దకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్ళాడు. మధ్యాహ్నం అయినా రాజు ఇంటికి తిరిగి రాక పోవడంతో తండ్రి రాములు బావి వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ వద్ద కరెంట్ షాక్ తగిలి కిందపడిపోయి ఉన్నాడు. ఈ విషయాన్ని ఆయన స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరోఘటనలో

పటాన్‌చెరు టౌన్: భాష్యం స్కూల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డు విద్యుదాఘాతానికి గురైన ఘట న పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణ శివారులోని భాష్యం బ్లూమ్స్ స్కూల్లో భగత్‌గల్లికి చెందిన ఎండీ ఉమర్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఇన్‌చార్జి ప్లే గ్రౌండ్ లో నీరు నిలిచాయని, అక్కడ శుభ్రం చేయా లని ఫోన్‌లో ఉమర్‌కు చెప్పాడు. నీరు తీసేందుకు స్కూల్‌కెళ్లిన ఉమర్ మోటర్ ప్లగ్ పెడుతూ ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురయి గాయాలయ్యాయి. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని బాధితుడు పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు

సంగారెడ్డి జిల్లా ఎస్పీ రమణకుమార్


విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ రమణకుమార్

జహీరాబాద్: కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రమణకుమార్ విద్యార్థుల అవగాహన సదస్సులో పేర్కొన్నారు. సోమవారం రంజోల్ గ్రామంలోని శ్రీ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఆయన సందర్శించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశాంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్, చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాలల్లో ర్యాగింగ్ చేయొద్దని సూచించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించి ఓటీపీ/వ్యక్తిగత పాస్‌వర్డ్/యూపీఐ నెంబర్ ఎవరికీ చెప్పొదన్నారు. కష్టపడకుండా డబ్బులు ఉచితంగా రావని, లక్కీ లాటరీ వంటి వాటిని నమ్మొద్దన్నారు. ఆన్‌లైన్ యాప్‌లో ఎలాంటి రుణాలు తీసుకోవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ మాట్లాడొద్దని, ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా సైబర్ క్రైం బారిన పడితే 1930 నెంబర్‌కు 24గంటల లోపు ఫిర్యాదు చేస్తే డబ్బులను రికవరీ చేయొచ్చన్నారు. చిన్న పిల్లలపై జరిగే నేరాల గురించి, పోక్సో చట్టం గురించి ఎస్పీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల అవసరం కావాలనుకున్నప్పుడు 100 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ వి.రఘు, సీఐ తోట భూపతి, జహీరాబాద్ రూరల్, ఝరాసంగం ఎస్‌ఐలు పి.పరమేశ్వర్, రాజేందర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

గుర్తు తెలియని వాహనం ఢీ కొని...


స్వామిగౌడ్(ఫైల్)

దుబ్బాకరూరల్: గుర్తు తెలియని వాహనం ఢీ కొని పాదాచారుడు మృతి చెందిన సంఘటన అక్బరోపేట భూంపల్లి మండలంలోని నగరం చౌరస్తా వద్ద జరిగింది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం...పోతారెడ్డిపేట గ్రామానికి చెందిన బండారి స్వామిగౌడ్(45) భూంపల్లి చౌరస్తా వద్ద బావర్చి హోటల్లో సప్లయర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున 4గంటలకు పోతారెడ్డిపేట నుంచి భూంపల్లి వైపు నడుచుకుంటూ వస్తుండగా సిద్దిపేట వైపు నుంచి ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని ఓ వాహనం ఢీ కొట్టింది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య నవ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ...


మల్లయ్య మృతదేహం

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెడ్డమైన మల్లయ్య(65)మృతి చెందాడని కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లికి చెందిన రెడ్డమైన మల్లయ్య సోమవారం ఉదయం హోటల్లో టీ తాగేందుకు ఇంటి నుంచి నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నక్రమంలో హైద్రాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెలుతున్న ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన మల్లయ్యను గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడని ఎస్సై పేరొన్నారు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ద్విచక్ర వాహనదారుడు బాదావత్ రవిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హత్నూర(సంగారెడ్డి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన హత్నూర పోలీస్ స్టేషన్ పరిధిలో కాసాల శివారులో ఆదివారం చోటుచేసుకుంది. సోమవారం హత్నూర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మద్దికుంట గ్రామానికి చెందిన వడ్డె రమేష్ (41)తో కాసాల గ్రామానికి చెందిన రమాదేవితో రెండో వివాహం జరిగింది. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేది. పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు పెట్టినా వారిలో మార్పు రాలేదు. ఆదివారం రమేష్ తన భార్యను తీసుకెళ్లడానికి కాసల గ్రామానికి వచ్చాడు. భార్యను తనవెంట రమ్మని కోరగా రమాదేవి భర్త వెంట వెళ్లడానికి నిరాకరించింది. దీంతో రమేష్ తిరిగి ఇంటికి వెళుతుండగా కాసాల బస్టాండ్ సమీపంలో రాగానే అకస్మాత్తుగా కింద పడిపోవడంతో స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే చికిత్స నిమిత్తం నరస్పాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

బెల్టు షాపులపై దాడులు ముగ్గురిపై కేసు

అల్లాదుర్గం(మెదక్): అక్రమ మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపులు, డాబాలో విక్రయాలు చేసినందుకు స్పెషల్ టాస్క్ పోలీసులు దాడి చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర ఐబీ చౌరస్తాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. చిల్వెర ఐబీ చౌరస్తాలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు రెండు షాపులపై దాడులు నిర్వహించి భారీ మొత్తంలో మద్యం స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపు నిర్వాహకులు జనార్దన్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ దేవిదాస్ చెప్పారు. అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో, ఎస్పీ ఆదేశాల మేర పోలీసులు దాడులు నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై గుర్తు తెలియని మృతదేహం సోమవారం లభ్యమైందని చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. సుమారు 30 సంవత్సరాల వయసు కల్గిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడని పోలీసులు పేర్కొన్నారు.

చర్యలు తీసుకోండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎమ్మెల్సీ కవితను కించపరుస్తూ ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోవింద్ సోమవారం సీఐ సంజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

ఉచిత శిక్షణ తరగతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి గోపాల్‌రావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ లేదా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పాటు

సిద్దిపేటఎడ్యుకేషన్: బీసీ స్టడీ సర్కిల్స్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్‌ను సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సిద్దిపేటకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా హైదరాబాద్‌కు చెందిన వసంతవాణి ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా కృష్ణారావు, జనరల్ సెక్రెటరీగా మహేష్, కోశాధికారిగా రమేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్టడీసర్కిల్స్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య


కనకవ్వ (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పెద్దకోడూరు గ్రామానికి చెందిన బోనాల కనకవ్వ(45), ఘణయ్య దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. వారికున్న 4 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో మూడున్నర ఎకరాల భూమి ముంపునకు గురైంది. ఈ క్రమంలో పెద్ద కూతురుకు వివాహం జరిపించారు. రెండో కూతురు వివాహం చేయాలని నిశ్చయించుకున్నారు. కుటుంబ పోషణ భారమై ఎలా గడుస్తుందని గత కొద్ది రోజులుగా మనోవేధన చెందుతుంది. మనస్థాపం చెందిన ఆమె ఈ నెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం పేర్కొన్నారు.

దాడి ఘటనలో 18 మందికి జైలు

రాయికోడ్(అందోల్): 2015లో నమోదైన రెండు కేసుల్లో 18 మంది నిందితులకు న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. సంగాపూర్‌కి చెందిన యూ.అశోక్ 2015లో మునిపల్లిలో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన యూ.అంజమ్మ కుటుంబ సభ్యులు వేధించడం వల్లే అశోక్ ఆత్మహత్య చేసుకున్నాడని అంజమ్మ ఇంటి ఎదుట కుటుంభ సభ్యులు ఆందోళన చేశారు. గ్రామస్తులు అశోక్ మృతికి పరిహారంగా అంజమ్మ మూడు ఎకరాల భూమిని మృతుడి కుటుంబానికి ఇవ్వాలని ఒప్పందం కుదిర్చారు. తమను భయపెట్టి అన్యాయంగా భూమిని రాయించుకున్నారని అంజమ్మ తిట్టింది. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అంజమ్మ, కుటుంబ సభ్యులను బంధించి దాడి చేశారు. బలవంతంగా భూమిని రాయించుకుని దాడికి పాల్పడ్డారని అంజమ్మ 9 మందిపై, ఆమె భర్త నర్సింలు 12 మందిపై వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదైన వారిలో ముగ్గురు చనిపోయారు. సోమవారం న్యాయమూర్తి జి.అనూష 18 మంది నిందితులకు రూ.2వేల చొప్పున జరిమానా వేసి 3 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి...

వట్‌పల్లి(అందోల్): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి మంజీరానది బ్యాక్ వాటర్ నీటిలో మునిగి మృతి చెందిన ఘటన సోమవారం దరఖాస్తుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ అంబర్యా తెలిపిన వివరాల ప్రకారం... దరఖాస్తుపల్లికి చెందిన మాదిగ సమ్మయ్య(38) అదే గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య, మంగళి నర్సయ్యలతో కలిసి ఆదివారం మధ్యాహ్నం మంజీర బ్యాక్‌వాటర్ పరిసర ప్రాంతానికి చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. వెంటనే మిగత ఇద్దరు కుటుంబికులకు సమాచం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు మంజీరానదిలో గాలించిన ఆచూకీ దొరకలేదు. తిరిగి సోమవారం గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా మృతదేహం బయటపడింది. సమ్మయ్య గ్రామ పంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుని భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో యువకుడు గల్లంతు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ చెరువులో యువకుడు గల్లంతైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కూకట్ పల్లికి చెందిన భార్గవ్ (22) స్నేహితులతో కలిసి నర్సాపూర్ అర్బన్ పార్క్ తిలకించేందుకు వెళ్లి రాయరావు చెరువులో గల్లంతయ్యాడు. భార్గవ్‌కు ఇటీవల జాబ్ రావడంతో స్నేహితులకు పార్టీ ఇచ్చేందుకు నర్సాపూర్ వచ్చినట్లు స్నేహితులు తెలిపారు. ముందుగా అర్బన్ పార్కును తిలకించి చెరువు పక్కన నిర్మిస్తున్న కాటేజీల పక్కన చెరువులో దిగి సరదాగా నీటిలో ఆడుతుండగా భార్గవ్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. అక్కడే ఉన్నా అతని స్నేహితులు అరుపులు పెట్టగా కాటేజ్‌లో వద్ద పనిచేస్తున్న మేస్త్రీలు వచ్చి భార్గవ్‌కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు వారు సమాచారం ఇవ్వగా తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్సై శివకుమార్‌లు గజ ఈతగాళ్లతో వెళ్లి గాలించినా ఫలితం లేదు. చీకటి పడడంతో మంగళవారం వెతికిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కళ్లల్లో కారం చల్లి.. ఆపై కత్తులతో దాడి

రూ.6.50 లక్షలు అపహరణ

రేగోడ్(మెదక్): ఓ వ్యాన్‌కు బైక్‌లు అడ్డుపెట్టి కళ్లలో కారం చల్లి.. కత్తులు, కర్రలతో దాడి చేసి దోపిడీ చేశారు. మెదక్ జిల్లా రేగోడ్ మండలంలోని తాటిపల్లి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ జార్జి, రేగోడ్ ఏఎస్ఐ మల్లయ్య హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. అల్లాదుర్గం సీఐ జార్జి తెలిపిన కథనం ప్రకారం.. జహిరాబాద్ నుంచి టీఎస్15 యూఏ 6556 నంబరు గల డీసీఎం వ్యాన్‌లో పెద్దశంకరంపేట, రేగోడ్‌లో సిగరేట్, బీడీ, చాక్లెట్ (ఐటీసీ ప్రోడక్ట్)ను విక్రయించి తిరిగి జహిరాబాద్ వెళ్తున్నారు. తాటిపల్లి సమీపంలోకి రాగానే రెండు బైక్‌లపై సుమారు ఆరుగురు దుండగులు వ్యాన్ ముందు.. వెనుకాల ఆపారు. వ్యాన్‌లో ఉన్న ఐదుగురి కళ్లల్లో కారం చల్లి కత్తులతో, కర్రలతో దాడి చేశారు. వ్యాన్‌లో ఉన్న సుమారు రూ.6 లక్షల 50వేలను తీసుకుని పారిపోయారు. ఈ విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ జార్జి, పెద్దశంకరంపేట ఎస్ఐ బాల్‌రాజ్, రేగోడ్ ఏఎస్ఐ మల్లయ్య ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

■ For Sale Single bit prime Land of 163 Acres. Clear title. Near Highway road-front. Excellent environment for living, business and agriculture. Red soil with high iron content. Nawabpet (V),Chityala(M),Jayashankar Bhupal pally (D). Contact: 7675868777, 9390085828. info@amodagroup.com [HA-26338]

SERVICES

■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 9032040019. [T-1773]

■ పర్సనల్, బిజినెస్,ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి వారం రోజులలో రుణంఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. 8598800260, 8901923173. [T-1784]

BUSINESS OFFER

■ Capro కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్. ✆ 9319814720. [T-1196145]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795231]

■ బజాజ్ ఫైనాన్స్ గజ్వేల్ నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం : 12000+Incentives అర్హత : Inter or Degree. Cell: 9989040730 Driving License and Two Wheeler mandatory. [H-1021951]

■ నల్లగొండ జిల్లా, దేవరకొండ పట్టణంలో ఇంట్లో 24 గంటలు వృద్ధునికి సపోర్ట్‌గా ఉండటానికి పురుషులు కావలెను. జీతం:15వేలు, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9848652107 [Y-784252]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


విద్యార్థులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేటఅర్బన్: పిల్లలకు సరైన సమయంలో పోషకాహారం అందిస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుందని జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆయుష్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు న్యూట్రిషన్ కిట్లు, రాగి లడ్డూలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. న్యూట్రిషన్ కిట్‌తో రోగ నిరోధక శక్తి పెరిగి, పోషకాలు అందుతాయన్నారు. మంత్రి హరీశ్‌రావు సారథ్యంలో ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. అంతకుముందు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఆయుష్ హెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రాం డైరెక్టర్ ప్రశాంతి, ఆర్‌డీడీ రవినాయక్, అర్బన్ వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం, ఎంపీడీవో సమ్మిరెడ్డి, సర్పంచ్ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ స్రవంతి ప్రశాంత్, జిల్లా ఆయుష్ విభాగం ఇంఛార్జీ ఉమాదేవి, వైద్యులు అజీమ్‌అహ్మద్, రజిని, గౌతమిప్రియ, ఫార్మసిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యాభివృద్ధితోనే సమాజ అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం సాయంత్రం చిన్నకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఎంఈఓ దేశిరెడ్డి, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీ శారద, శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: రోజుకో కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నా సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సీపీ శ్వేత తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సోమవారం జరిగిన సైబర్‌నేరాల వివరాలు ఇలాఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని ఓ వ్యక్తికి ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి నమ్మించాడు. వెంటనే సదరు బాధితుడు రూ.27,303 పెట్టుబడిగా పెట్టి మోసపోయాడని గ్రహించాడు.

మరో ఘటనలో

మద్దూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి ర్యాపిడ్ అప్లికేషన్ సమస్య ఉండడంతో కస్టమర్‌కేర్ నెంబర్‌కి ఆన్‌లైన్‌లో సెర్చ్ చేయగా అందులో కనిపించిన నెంబర్‌కు ఫోన్ చేశాడు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి యాప్ డౌన్‌లోడ్ కోసం డబ్బులు చెల్లించాలని తెలిపారు. దీంతో అతను ఆన్‌లైన్‌లో రూ.14,981 పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా ఏలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

ఇద్దరు చిన్నారుల అదృశ్యం

- వాట్సాప్, సోషల్ మీడియా చూసి కుటుంబ సభ్యులకు అప్పగింత

సిద్దిపేటకమాన్: ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమైన ఇద్దరు పిల్లలను పోలీసులు కుటుంబ సభ్యులను గుర్తించి వారికి అప్పగించిన సంఘటన సిద్దిపేట పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. వన్ టౌన్ సీఐ బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంతోష్ తన భార్య, ఇద్దరు పిల్లలతో పది సంవత్సరాలుగా సిద్దిపేట పట్టణం నాసర్‌పూరలో నివాసం ఉంటున్నాడు. సంతోష్ సిద్దిపేటలో ఓ ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం సంతోష్ పని నిమిత్తం బయటకు వెళ్లగా తన భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉంది. ఈ క్రమంలో ఇద్దరు పిల్లలు బాబు అమాన్(5), పాప స్వీటీ(3)తమ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా కొద్ది దూరంలో ఉన్న బారాహిమామ్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. దీంతో వారు తిరిగి ఇంటికి వెళ్లలేకపోయారు. రోడ్డుపైన పిల్లలు ఏడుస్తూ ఉండడాన్ని యాదగిరి గుర్తించి పిల్లలను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న సీఐ బిక్షపతి, ఎస్ఐలు నరసింహారావు, రవీందర్, మల్లేశం, హెడ్ కానిస్టేబుల్ చంద్రం ఇద్దరు పిల్లల ఫొటోలు, వారు తెలిపిన వివరాలను వాట్సప్ గ్రూపులో, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న ఐస్‌క్రీం ఫ్యాక్టరీ యజమాని పిల్లల తండ్రిని తీసుకుని పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. పోలీసులు ఇద్దరు పిల్లలను సంతోష్‌కు అప్పగించారు. ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

సిద్దిపేటలో యువతి...

యువతి అదృశ్యమైన ఘటన సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం...గొడుగు బుజ్జి, శ్రీనివాస్ దంపతులు తమ ఇద్దరు కూతుళ్లతో కలిసి సిద్దిపేట న్యూ కేసీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. చిన్న కూతురు సంతోషి (19) ఏడాది నుంచి పట్టణంలోని వైభవం షాపింగ్ మాల్‌లో పని చేస్తుంది. రోజు మాదిరిగానే విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి బుజ్జి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెన్నాపూర్‌లో యువకుడు...

శివ్వంపేట(నర్సాపూర్): చెన్నాపూర్ గ్రామంలో యువకుడు అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ రవికాంత్‌రావ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మన్నే రమేష్ ఈ నెల 13న మధ్యాహ్నం మసీద్‌పల్లిలోని అక్క ఇంటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అతను అక్క దగ్గరకు వెళ్లకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రమేష్‌కు ఫోన్ చేస్తే స్విచ్ అఫ్ ఉంది. దీంతో బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా అతని ఆచూకీ లభించలేదు. సోమవారం యువకుడి తండ్రి మన్నే వెంకటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

గజ్వేల్‌రూరల్: నీటిని పొదుపుగా వాడుకోవాలని, లేదంటే భవిష్యత్ తరాలకు ఇబ్బందులు తప్పవని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ బొడిగే అన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా సోమవారం గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, వృక్ష, జంతు శాస్త్రాలు, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘మారుతున్న ప్రపంచ వాతావరణ పరిస్థితుల్లో నీటి పొదుపు’ అనే అంశంపై మాట్లాడారు. చెట్లను నరకడం ద్వారా భూతాపం పెరిగి పోతుందని, సహజ వనరుగా లభించే నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. భూగోళంపై నీటి లభ్యత, వినియోగంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఆఫీసర్ డాక్టర్ భవాణి, సదస్సు సంచాలకులు డాక్టర్ రమేష్‌బాబు, ఉపసంచాలకుడు విజయభాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు బాల్‌రాజు, ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ పెద్దిరాజు, డాక్టర్ కవిత, లావణ్య, రజిత, మార్కండేయ, సాయికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి బీజేపీ చేసింది శూన్యం

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడకుంట వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న బోడకంటి వెంకటేశ్వర్లు

సిద్దిపేటజోన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసింది శూన్యమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడకుంట వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 20వరకు జిల్లాలో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. పది గ్రామాలకు ఒక యూనిట్‌గా సమావేశాలు నిర్వహిస్తామని, ప్రతీ ఒక్కరినీ ఇందులో భాగస్వామ్యం చేస్తామన్నారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి, 25న పార్టీ జెండా ఆవిష్కరణ, 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, జూన్ 1న అమరవీరుల స్మారక చిహ్నం, 2న విద్యార్థి విభాగ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్ హస్తం ఉందని బండి సంజయ్ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. శర్మ, రాజనర్స్, సాయిరాం, ఎల్లారెడ్డి, వర్మ, నాగరాజు రెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.